క్లుప్తంగా

బ్రాహ్మణపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



రోగి ఆరోగ్యస్థితిని ఫైల్‌లో పరిశీలిస్తున్న డాక్టర్ మురళి

పెద్దపంజాణి: మండలంలోని బ్రాహ్మణపల్లెలో గురువారం పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 66 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిని పరీక్షించి వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి, ఏఎన్ఎం రెడ్డెమ్మ, ఆశా వర్కర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

'రంజాన్ తోఫా' పంపిణీ



తోఫా కిట్లను పంపిణీ చేస్తున్న ఇస్మాయిల్

పుంగనూరు: పట్టణంలోని ఫలాహ్ ట్రస్ట్ నిర్వాహకులు 100 మంది పేదలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసింది. గురువారం సంస్థ కార్యదర్శి ఇస్మాయిల్‌ఖాన్ మాట్లాడుతూ, ట్రస్ట్ వ్యవస్థాపకులు హఫీజ్‌ఖాన్ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రూ.2 వేల విలువ చేసే ఒక్కో సరుకుల కిట్‌ను కానుకగా అందజేసినట్టు చెప్పారు. రంజాన్ మాసంలో ముస్లిం పేదలకు ఆదుకోవడమే తమ ధర్మమన్నారు. కార్యక్రమంలో అబ్దుల్, అలీమ్, మౌలానా, కమాలుద్దీన్, ఉమ్రి, అహమ్మద్‌ఖాన్, ఒసామా, షఫి, రియాజ్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంతోనే చైతన్యం



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేయడం సాధ్యమవుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ కవితా దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక స్థానిక కళామందిరంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్షరపు విత్తులను నాటి ఊహలతో సాగుచేసేవాడు కవి అన్నారు. సాహిత్యాన్ని చదవడం సమాజంలో బాగా తగ్గిందని, సమాజం స్మార్ట్‌ఫోన్ గుప్పెట్లోకి వెళ్లిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కనీసం మన భాషను బతికించుకోవాలన్నా పుస్తకాలను చదవడం ఇప్పటితరం అలవాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మొహిద్దీన్, చంద్రశేఖరయ్య, సమితి కార్యదర్శి పుష్ప తదితరులు పాల్గొన్నారు.

యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా కోర్సులకు అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సర్టిఫికెట్ యోగా కోర్సుకు కనీస విద్యార్హత పదవతరగతి, తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలని చెప్పారు. 16 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. డిప్లొమా కోర్సుకు ఇంటర్, తత్సమాన కోర్సు ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. సర్టిఫికెట్ కోర్సు 6 నెలలు, డిప్లొమా కోర్సు ఏడాది కాల వ్యవధి ఉంటుందని చెప్పారు. ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9441555990, 9182420973 నంబర్లలో సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ఉద్యమాలకు 'అప్పారి' స్ఫూర్తి



ఐరాల: ఉద్యోగులు, ఉపాధ్యాయులు దివంగత యూటీఎఫ్ వ్యవస్థాపకుడు అప్పారి వెంకటస్వామిని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏకాంబరం అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతి మండల యూటీఎఫ్ అధ్యక్షుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అప్పారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి లీలావతి, అరుణ్‌కుమార్, సరోజమ్మ, వాణి, కరుణ పాల్గొన్నారు.

మేము సిద్ధం..మా బూత్ సిద్ధం

- పార్టీ గెలుపే అందరి లక్ష్యం
- ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ



పెద్దారికుంట బూత్ కమిటీ సభ్యులతో సమావేశమైన ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మళ్లీ ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కొనసాగాలంటే రాబోవు సార్వత్రిక ఎన్నికలలో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పలు పంచాయతీ బూత్ కమిటీ సభ్యులకు 'మేము సిద్ధం ..మా బూత్ సిద్ధం' సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బూత్ పరిధిలోని ప్రతి గడపకూ వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాలు అన్నీ జతకట్టి, చేస్తున్న కుయుక్తులు, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టడమే కాకుండా ఆ కూటమి తీరేమిటో ప్రజలకు చాటిచెప్పాలన్నారు. ఎన్నికల బరిలో అభ్యర్థులుగా ఉన్న తమను ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. బూత్ కమిటీలు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీ జీడీబాబు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ శంకరప్ప, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచులు రమేష్‌బాబు, భాస్కర్, రమేష్, ఎంపీటీసీలు పరంధామ, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి 'మేము సిద్ధం'



తాళ్లపల్లెలో బూత్ కమిటీ సభ్యుల జాబితాను నాయకులకు అందజేస్తున్న పార్టీ నేతలు

గంగవరం: మండలంలోని మొత్తం 50 బూత్‌లకు నియమించిన బూత్ కమిటీ సభ్యుల జాబితాను పార్టీ నేతలు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలోని నాయకులకు గురువారం అందజేశారు. ఎన్నికల సమరానికి 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' అని వారంతా నినదించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పార్టీ నేతలు బూత్ కమిటీ సభ్యులను కోరారు. ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన విధి విధానాలను తెలియజేశారు. ప్రజలకు ఎంతో మేలు చేసిన వైఎస్సార్ సీపీని ఓడించాలనే కక్షతో కూటమిగా ఏర్పడిన ప్రతిపక్షాలు గ్రామాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు సిద్ధమయ్యాయని, వాటి కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి, లక్షలాది కుటుంబాలు పొందిన లబ్ధిని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. తద్వారా చిత్తూరు ఎంపీగా రెడ్డెప్ప, ఎమ్మెల్యేగా వెంకటేగౌడను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని మార్గదర్శనం చేశారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, అన్ని పంచాయతీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో శతవర్ష కుంభాభిషేకం



- ఘనంగా కన్యకాపరమేశ్వరి ఊరేగింపు

కుప్పం: స్థానిక కొత్తపేటలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శతవర్ష కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ దేవాలయం నిర్మించి వందేళ్లు పూర్తి చేసుకోవడంతో ఈ కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం



వి.కోట ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

వి.కోట: మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ వర్కింగ్ జర్నలిస్టుల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా జగన్మోహన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా రాజేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా నిసార్ అహ్మద్, కార్యదర్శిగా రోషన్, కోశాధికారిగా షఫిరుల్లాఖాన్, సహాయ కార్యదర్శులుగా వేణుగోపాల్, సునీల్, గౌరవ సలహాదారులుగా శ్రీనివాసులు, రుక్మాంగేశ్వరరాజు, పీఆర్‌ఓగా గిరిబాబు, కార్యవర్గ సభ్యులుగా గోపిరెడ్డి, దేవరాజులు, అన్వర్‌బాషా, మోహన్‌బాబు, అశోక్, రమేష్‌బాబు, సురేంద్రబాబు, సుబ్రమణ్యం, ఫయాజ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఓటు వేయడం అందరి బాధ్యత



ఓటు హక్కుపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మెప్మా అధికారులు

కుప్పం: ఓటు హక్కు వినియోగంపై గురువారం స్థానిక మెప్మా కార్యాలయ ప్రాంగణంలో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు గురవకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి ఇదో ఆయుధమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఒక్కరూ ఓటు వేయడం తమ బాధ్యత గుర్తెరిగి పోలింగ్ రోజున ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా అధికారి జగదీష్, స్థానిక అధికారులు, పట్టణంలోని మహిళలు పాల్గొన్నారు.

బట్టందొడ్డిలో..



పెద్దపంజాణి: బట్టందొడ్డిలో..

పెద్దపంజాణి: ఓటు హక్కు వినియోగంపై గురువారం మండలంలోని బట్టందొడ్డిలో వెలుగు ఏపీఎం క్రిష్ణప్ప ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లకు ఈవీఎంల వినియోగం, ఓటింగ్ ప్రక్రియ గురించి తెలియజేశారు. ఎన్నికల వరకూ అన్న సచివాలయాల పరిధిలో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సీసీ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంఘమిత్రలు కళావతమ్మ, ఈశ్వరమ్మ, సంధ్య పాల్గొన్నారు.

వేపనూనె పిచికారీతో మంచి ఫలితాలు



పంట పరిశీలనలో శాస్త్రవేత్తలు, అధికారులు

చిత్తూరు రూరల్: కూరగాయల సాగులో రైతులు వేపనూనె పిచికారీ చేస్తే తెగుళ్ల బెడద ఉండదని, మంచి దిగుబడులు వస్తాయని డాట్ సెంటర్ శాస్త్రవేత్త రెడ్డిరామ్ సూచించారు. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో సాగవుతున్న పలు రకాల పంటలను ఆయన గురువారం పరిశీలించారు. కాకర, వంగ, మిరప, మామిడి పంటల సాగు విధానంపై ఆరా తీశారు. మిరపలో ముడత తెగులు, వంగలో పుచ్చుకాయ తెగులు ఉన్నట్లు గుర్తించి మందుల పిచికారీపై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయంలో వేప నూనె వాడకాన్ని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త నాగమణి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి పద్మజ, తుమ్మింద వ్యవసాయ సహాయకుడు మోహన్, రైతులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నగదు తరలిస్తే సీజ్



రొంపిచెర్ల క్రాస్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సుకుమార్

రొంపిచెర్ల: ఇతర ప్రాంత్రాలకు నగదు తరలింపు విషయంలో అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఐ సుకుమార్ అన్నారు. గురువారం ఆయన రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నగదు విషయంలో పరిమితులు విధించారన్నారు. ఎవరైనను రూ.50 వేల వరకు మామాత్రమే తీసుకెళ్లవచ్చని, అంతకుమించి తీసుకెళ్లదలిస్తే అనుమతి పొందాలని, లేదంటే ఆ సొమ్మును సీజ్ చేయకతప్పదన్నారు. వాహనాల్లో డబ్బు, మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డబ్బు, మద్యం తీసుకు వెళ్లే వారు రశీదు కలిగి, అధికారుల నుంచి అనుమతి పొంది ఉండాలని స్పష్టం చేశారు. ఎన్నికలు ముగిసే వరకూ నిత్యం ఈ తనిఖీలు చేస్తూ ఉంటామన్నారు.

వడదెబ్బపై అవగాహన

యాదమరి: గ్రామీణ ప్రజలు వేసవిలో అప్రమత్తంగా ఉండాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. గురువారం మండలంలోని పెరియంబాడిలో గ్రామస్తులకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో గ్రామీణులు, రైతులు ఎండలో పనులకు వెళ్లినా వడదెబ్బకు గురవుతారన్నారు. వడదెబ్బకు గురైన వారికి గుండె వేగంగా కొట్టుకుంటుందని, అధికంగా దాహం వేస్తుందని, కాళ్లు చేతులు వణుకుతాయని లక్షణాల గురించి వివరించారు.

అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నాం



మేలుపట్లలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ లలిత, మధుసూదన్‌రెడ్డి



ఎన్ఎస్‌పేటలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ నూర్జహాన్, సలామత్

–ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నేతలు

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడుగుతున్నామని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. గురువారం తిరుపతి రోడ్డు, ఎల్ఐసీ కాలనీ, కొత్తపేట, కొత్తయిండ్లు కాలనీలలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత, రెడ్డిజన సంక్షేమ సంఘ నాయకుడు మధుసూదన్‌రెడ్డి మేలుపట్లలో, ఎన్ఎస్ పేటలో కౌన్సిలర్లు నూర్జహాన్, రాఘువేంద్ర, మైనారిటీ నాయకుడు సలామత్, చంద్రకాంతవీధిలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము ప్రచారం చేశారు. వీరితో పాటు కౌన్సిలర్లు అర్షద్‌అలి, కిజర్‌ఖాన్, ఆదిలక్ష్మి, జేపీ యాదవ్, రెడ్డెమ్మ, రేష్మా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలకు ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఆదరించి అవకాశం ఇవ్వండి



కొత్తపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న భరత్

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్

కుప్పం: జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం శాసన సభ్యుడిగా అదరించి అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ కోరారు. గురువారం స్థానిక కొత్తపేటలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్ర ప్రచారం చేశారు. అందరికీ అందుబాటులో ఉన్న తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానన్నారు. ఐదేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పార్టీకతీతంగా లక్షలాది మంది లబ్ధి పొందారన్నారు. నవరత్న పథకాలతో అర్హులందరూ ప్రయోజనం పొందారని, లబ్ధి పొందిన కుటుంబాలన్నీ ఆనందంగా ఉన్నాయన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలే కాకుండా పలు రంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిపురం మండలంలో..



శాంతిపురం: బడుగుమాకులపల్లెలో ప్రచారం చేస్తున్న నాయకులు

శాంతిపురం: మండల వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం జోరందుకుంది. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎక్కడిక్కడ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను కలిసి గత ఐదేళ్లలో వారి కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేసిన మేలును వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గురువారం రాత్రి బడుగుమాకులపల్లెలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జె భరత్ ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. కరపత్రాలు అందజేసి, తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తనను గెలిపిస్తే నిత్యం కుప్పంలో అందుబాటులో ఉంటానని, కష్ట సుఖాల్లో తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మండల కో–ఆప్షన్ సభ్యుడు నిసార్, స్థానిక సర్పంచ్ ఏవీ జయరాం, నాయకులు వినోద్‌కుమార్, మురళీమోహన్‌రెడ్డి, జగదీష్, మునస్వామి, శీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు దివంగత పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి 30వ వర్ధంతిని ఎర్రాతివారిపల్లెలో గురువారం నిర్వహించారు. భాస్కర్‌రెడ్డి చిత్రపటానికి మంత్రితో పాటు కుటుంబ సభ్యులు ఘన నివాళి అర్పించారు. ఆయన సమాధి వద్ద పూజల అనంతరం అన్నదానం చేశారు. నివాళులు అర్పించిన వారిలో మంత్రి సతీమణి పెద్దిరెడ్డి స్వర్ణలతమ్మ, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, అభినయ్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నిశాంత్‌రెడ్డి ఉన్నారు. పలువురు పార్టీ నాయకులు మంత్రిని, ఎంపీని కలిశారు. అలాగే జోగివారిపల్లెలోను భాస్కర్‌రెడ్డి అభిమానులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సత్యవేడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రాజేష్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, పులిచర్ల ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ

రామకుప్పం: మండలంలోని రాజుపేట గ్రామ సమీపంలో గురువారం ఉదయం కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన కథనం..శాంతిపురం మండలానికి చెందిన మహేష్ 300 టెట్రా ప్యాకెట్లు,7 బీరు బాటిళ్లతో ద్విచక్రవాహనంలో వెళ్తుండగా తనిఖీలో పోలీసులకు పట్టుబడ్డాడు. బైక్‌తో సహా మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.25వేలు ఉంటుందని ఎస్‌ఐ చెప్పారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం... మండలంలోని రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. కరసనపల్లెకు చెందిన కాంతమ్మ వద్ద లగేజీని తనిఖీ చేయగా 192 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు, అలాగే పెద్దవెలగటూరుకు చెందిన హరి నుంచి 288(90ఎంఎల్) టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి





మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్ బాబు, రామకుప్పం: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

పులిచెర్ల(కల్లూరు): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. గురువారం మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆయన మండలంలోని వివిధ శాఖల అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వసంత లత, వెలుగు ఏపీఎం మధుసూదన్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సభల నిర్వహణకు అనుమతి తప్పనిసరి

రామకుప్పం: రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు ఎన్నికల నియమావళి అమలు విషయంలో దృష్టి సారించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వాల్‌పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని, గోడ మీద రాతలను చెరిపివేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్యలను గుర్తించినట్లయితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరన్న, డిప్యూటీ తహసీల్దార్ దిలీప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: ఎన్నికల నియమావళిని ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ నారాయణస్వామి, ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు కోరారు. మండలంలోని సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశాలు నిర్వహించి, ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఉపాధి, వలంటీర్లు నియమావళిని పాటించాలని ఆదేశించారు.



సదుం: అవగాహన కల్పిస్తున్న అధికారులు